క్లుప్తంగా

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందిస్తున్న వలంటీర్

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ వలంటీర్ అశోక్ హైదరాబాద్‌కు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేశాడు. వివరాలు..గ్రామానికి చెందిన వి.అమ్మని అనే వృద్ధురాలు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని బంధువుల ఇంటిలో ఉండిపోయింది. వలంటీర్ అశోక్ హైదరాబాద్ వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందించాడు. వలంటీర్‌ను వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ అభినందించారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గుత్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి? కార్యక్రమ నిర్వహణపై సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టణ కన్వీనర్ పీరా, మండల కన్వీనర్ గోవర్దన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి హాజరవుతున్నార న్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఎస్ఎస్ ట్యాంకుల్లోకి నీటి పంపింగ్



పంపింగ్‌ను పరిశీలిస్తున్నకమిషనర్

గుంతకల్లుటౌన్: హెచ్ఎల్ఎస్ కాలువ నుంచి సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌ల్లోకి జరుగుతున్న నీటి పంపింగ్‌ను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పరిశీలించారు. శుక్రవారం ఎంఈ గురప్పయాదవ్‌తో కలిసి ఆయన రిజర్వాయర్, పంప్‌హౌస్, ఫిల్టర్‌బెడ్స్, క్లియర్‌వాటర్ హౌస్‌లను తనిఖీ చేశారు. మోటార్ల పనితీరు, తాగునీటి శుద్ధి, నీటి నిల్వలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.డీఈ శ్రీకాంత్ ఉన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. వైటీ చెరువు గ్రామానికి చెందిన వెంకటేష్ బైక్‌పై పని మీద గుత్తికి బయలు దేరాడు. చెరువు కట్ట వద్ద రోడ్డు కు అడ్డంగా ఓ పిచ్చోడు అడ్డం వచ్చాడు. అతన్ని తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో వెంకటేష్ తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


సయ్యద్ బాషా ఉరుసు



షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి: కోట వీధిలో శుక్రవారం హజరత్ సయ్యద్ బాషా ఉరుసు హిందూ, ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక బండే నవాజ్ దర్గా నుంచి కోటలోని హజరత్ సయ్యద్‌బాషా దర్గా వరకు షంషీర్‌ను ఊరేగించారు.

బరితెగించిన ఇసుకాసురులు



ఇసుక ట్రాక్టర్‌ను వెంబడిస్తున్న పోలీసు

తాడిపత్రి: తాడిపత్రి ప్రాంతంలో ఇసుకాసురులు బరితెగించారు. పోలీసులు ఆపినా పట్టించుకోవడం లేదు. వివరాలు..తాడిపత్రి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వైపు నుంచి మూడు ఇసుక ట్రాక్టర్లు అనంతపురం రహదారిపై వెళుతున్నాయి. ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ కానిస్టేబుల్ అందులోని ఓ ట్రాక్టర్‌ను ఆపాడు. ట్రాక్టర్‌కు పైలట్‌గా వస్తున్న ట్రాక్టర్ యజమాని కానిస్టేబుల్‌ను మేనేజ్ చేసేందుకు ప్రయత్నించినా అతడు ససేమిరా అన్నాడు. ఆ వెంటనే మరో ఇసుక ట్రాక్టర్ వెనుక వైపు నుంచి వస్తుండడంతో దానిని ఆపేందుకు కానిస్టేబుల్ అటుగా వెళ్లగానే, అంతకు ముందు ఆపిన ట్రాక్టర్ ఉడాయించింది. దీంతో దానిని ఆపుదామనుకుని కానిస్టేబుల్ తన బైక్‌పై బయలుదేరాడు. వెంటనే వెనుక ఇసుక లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్ పక్కనే ఉన్న ఓ సిమెంట్ పెళ్లల పరిశ్రమలో అన్‌లోడ్ చేయించాడు. మరో వైపు కానిస్టేబుల్ వెంటబడి మరీ సదరు ట్రాక్టర్‌ను ఆపినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

తాడిపత్రి అర్బన్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. చిన్నపొలమడకు చెందిన పుల్లయ్య, తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డుకు చెందిన వై.రంగయ్యను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: జగనన్న పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం రెడ్డిపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి వారు చెప్పిన టీడీపీ కార్యకర్తలకు, నాయకులకే సంక్షేమ పథకాలు అందించేవారన్నారు. పాదయాత్ర చేస్తున్న సమయంలో సీఎం జగనన్న ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని వాటికి అనుగుణంగా మేనిఫెస్టోను తయారు చేశారన్నారు. ప్రజల దీవెలనతో అధికారంలోకి వచ్చిన జగనన్న సచివాలయాలను ప్రవేశ పెట్టి వాటి ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించేలాగా ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ప్రజలు కూడా జగనన్న చేస్తున్న అభివృద్ధి చూసి ఆదరించాలన్నారు. ఏదైన కారణాల వల్ల సంక్షేమ పథకాలు రాకున్నా. వాటిని పరిశీలించమని, సచివాలయ సిబ్బందికి, మండల అధికారులను అక్కడికక్కడే పిలిచి ఆదేశాలు జారీ చేశారు. జెడ్పీటీసీ భాస్కర్, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ రామగోపాల్, ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచ్‌లు నరసమ్మ, పార్వతి, శ్రీనివాసరెడ్డి, యువనేత ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, కొత్తపల్లి నాగలింగారెడ్డి, సాకే నారాయణస్వామి, బోనా నాగలింగారెడ్డి, రామచంద్రారెడ్డి, లింగారెడ్డి, జయరామిరెడ్డి, అశోక్ కుమార్, మిద్దె కుళ్లాయప్ప, పూల నారాయణ స్వామి, చికెన్ నారాయణస్వామి, ముత్యాలశీన పురుషోత్తం, సాకే లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఈ ఫొటోలో ఉన్న మహిళ రెడ్డిపకి చెందిన సాలమ్మ. ఈమెకు సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం వివిధ పథకాలు ద్వారా రూ.7,16,075 లబ్ధి చేకూర్చింది. జగనన్న, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి రుణపడి ఉంటామని సాలమ్మ ఆనందం వ్యక్తం చేస్తోంది.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఈశ్వరయ్య కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: పెద్దవడుగూరు మండలం మిడుతూరుకు చెందిన ఈశ్వరయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఈశ్వరయ్య కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈశ్వరయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

సామాన్యుడికి ఉచితంగా ఖరీదైన వైద్యం



మెడికల్ రిపోర్టులను అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: సామాన్యుడికి సైతం ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం ముచ్చుకోటలో వైఎస్సార్ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో అత్యవసర సమయంలో సామాన్యుడు ఖరీదైన వైద్యాన్ని చేయించుకోవాలంటే అందిన చోట్ల అప్పులు చేయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగున్నరేళ్ల వ్యవధిలో ఆరోగ్యశ్రీ, 108, 104 వాహన సేవల ద్వారా ఎంతో మంది ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా పొందారన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిద రకాల వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి మెడికల్ రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్ కుమార్, ఉషారాణి, సుంకన్న, సాయి చరణ్, పల్లవి, ఇంజుమామ్, ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: చిలమకూరు సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైద్యులు అంజాద్‌అలి, లోకేష్, కీర్తన 250 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం స్పెషలాఫీసర్ ఫిరోజ్‌ఖాన్, ఎంపీడీఓ వీరరాజు, తహసీల్దారు సుమతి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు కంటి వెలుగు కార్యక్రమం కింద 100 మంది వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు.

పుట్లూరు: అరకటివేముల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు 232 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: గన్నెవారిపల్లి కాలనీ సచివాలయం -3లో శుక్రవారం జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు కాలనీ వాసులకు చికిత్స చేసి మందులను పంపిణీ చేశారు. మహిళా సమాఖ్య సభ్యులు పౌష్టికాహారం స్టాళ్లను ఏర్పాటు చేసారు. కఎంపీడీఓ రంగారావు, వైద్యులు లావణ్య , సుమన్, సిబ్బంది పాల్గొన్నారు

పెద్దవడుగూరు: చిన్నవడుగూరు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రీనివాసబాబు, శ్రీనివాసులరెడ్డి, అమర్‌నాథ్ 291 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. జెడ్పీటీసీ బాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని నం:3 సచివాలయం వద్ద గ్రామ సర్పంచు అనూరాధ అధ్యక్షతన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. గైనకాలజిస్టు శశికళ, డెర్మలాజిస్టు నాగరమ్య, పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీరామ్ కుమార్, దేవరాజన్ 430 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి, ఎంపీడీఓ లక్ష్మినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: కల్లూరు-1 గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్పెషల్ డాక్టర్ మనోహర్ రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్లు షమీన్ తాజ్,దిలీప్‌కుమార్ 167 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి, తహసీల్దార్ ఉషారాణి, కోఆప్షన్ మెంబర్ బాబా యునీస్ పాల్గొన్నారు.

గుత్తి రూరల్: కరిడికొండ గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు సందీప్‌యాదవ్, దేవేంద్రనాయక్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను మండల ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి పరిశీలించారు. సర్పంచ్ రమేష్, ఎంపీడీఓ శివాజీరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు కాశింవలి పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: అనంత సాగస్ కాలనీలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు 383 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఉప సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ రాజేశ్వరి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బుక్కరాయసముద్రం: బొమ్మలాటపల్లిలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఆలయ పునరుద్ధరణకు విరాళం

పామిడి: పట్టణంలోని పామిడమ్మ, చౌడేశ్వరీఆలయాల పునరుద్దరణకు శుక్రవారం భోగేశ్వరాలయ కమిటీ ప్రెసిడెంట్ ఎస్ మురళీధర్‌గుప్తా రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. తన తండ్రి ఎస్ వెంకటస్వామి గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రాజీవ్, శివకుమార్‌తో కలిసి ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డికి చెక్కు అందించారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

శింగనమల: మండలంలో పంట నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఈస్ట్.నరసాపురం, రాచేపల్లి, కొరివిపల్లి , సీ.బండమీదపల్లి రైతు భరోసా కేంద్రాల్లో ఈ-కేవైసీ నమోదు చేశారు. ఏఓ అన్వేష్‌కుమార్ మాట్లాడుతూ 8లోప ఈకేవైసీ చేయించాలన్నారు.

బ్యాంకు సేవలపై కళాజాతా

శింగనమల: బ్యాంక్ డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తరిమెల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర మురళి ప్రజలకు సూచించారు. శుక్రవారం నిదనవాడ గ్రామంలో బ్యాంక్ సేవలపై కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణకు కృషి చేయండి

పెద్దవడుగూరు : వన్య ప్రాణుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎఫ్ఆర్ఓ మధుబాబు, ఎఫ్ఎస్ఓ నారపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం క్రిష్టిపాడు గ్రామంలో వన్యప్రాణుల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలన్నారు. అడవుల్లో ఉన్న జంతువులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అడవుల్లో కలప తరలింపును అడ్డుకోవాలని కోరారు. ఎఫ్‌బీఓ మాదవి, ఏబీఓ మంజులవాణి, రమేష్, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



వన్యప్రాణుల రక్షణపై అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

జగనన్నతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

- 'వై ఏపీ నీడ్స్ జగన్' సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీగుంతకల్లప్ప స్వామి కల్యాణ మండపంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమ నిర్వహణపై సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గుంతకల్లు పట్టణ, మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గుంతకల్లు నియోజకవర్గం చరిత్రలో కూడా ఎప్పుడూ లేని విధంగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజెప్పాల న్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఆయా సచివాలయాల పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, లబ్ధి పొందిన వారి వివరాలతో కూడిన ప్రచార బోర్డులను ఆవిష్కరించాలన్నారు. అదే రోజు సాయంత్రం సచివాలయ బయట పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు జెండాలను ప్రజలకు పంచిపెట్టాలని, రాత్రికి అక్కడే బస చేసి ప్రజలతో సమావేశాన్ని నిర్వహించాలని వివరించారు. చంద్రబాబు మోసాలు, జగనన్న పథకాలపై ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను స్వీకరించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, పార్టీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, జేసీఎస్ పట్టణ, మండల కన్వీనర్లు జింకల రామాంజినేయులు, ఖలీల్, గోవింద్‌నాయక్, జెడ్పీటీసీ కదిరప్ప, మండలాధ్యక్షుడు మోహన్, వీరశైవలింగాయత్, దూదేకుల కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు యుగంధర్‌రెడ్డి, హొన్నూర్‌వలి, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గృహసారథులు, కన్వీనర్ల కమిటీ ఏర్పాటులో వందశాతం సాధించి జిల్లాలో 3వ స్థానంలో నిలిచిన జేసీఎస్ మండల కన్వీనర్ గోవింద్‌నాయక్‌ను ఎమ్మెల్యే శాలువా, పూలమాలతో సన్మానించారు.

త్వరలో వెయ్యి కోట్లతో సోలార్ పవర్ ప్రాజెక్టు

గుంతకల్లు మండలం దోనిముక్కల, తిమ్మాపురం, నల్లదాసరపల్లి మధ్య రూ.వెయ్యి కోట్లతో సోలార్‌పవర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే వైవీఆర్ తెలిపారు. ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని అనేక మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

సంక్షిప్త సమాచారం

నెట్టికంటి ఆలయంలో సౌకర్యాలు మెరుగుపర్చండి

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఆలయ పర్యవేక్షణ, సేవా సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సమితి నాయకులు ఆలయ ఈఓ డి.వెంకటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో సరైన వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అన్ని ప్రాంతాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలన్నారు. ఆలయంలోని తాళాలను ఇన్‌స్పెక్టర్ దగ్గర మాత్రమే ఉంచాలిని విజ్ఞప్తి చేశారు. సమితి నాయకులు శ్రీనాథ్‌గౌడ్, కృపాకర్, భాస్కర్ రంగయ్య, ఇల్లూరి కేదార్‌నాథ్, రాముడాయల్, రామాంజినేయులు, జీవన్‌గుప్తా పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్ల తనిఖీ

గుత్తి: పట్టణంలోని భారత్, ఇండేన్ గ్యాస్ గోడౌన్‌లను శుక్రవారం సీఎస్‌డీటీ సూర్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్టమర్లు బుక్ చేసుకున్న వెంటనే గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేయాలని, ఐదు కిలో మీటర్ల దూరం లోపు ఎలాంటి రవాణా చార్జీలు వసూలు చేయరాదని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు హుసేనప్ప, సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్‌కు ఘన సత్కారం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని సున్ని రోషన్ మసీదు ఇమామ్ మంజూర్ ఆలం ఖాదిరి సాబ్ అనారోగ్యంతో శుక్రవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఖాదిరి సాబ్‌ను మసీదు కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ అధ్యక్షుడు జీఎం బాషా ఖాదిరిసాబ్ సేవలను కొనియాడారు. మసీదు కమిటీ సెక్రటరీ నవీర సూల్, సభ్యులు జబ్బార్, జిలాన్, షానీర్, గౌస్, కరీముల్లా, ఇస్మాయిల్ షరీఫ్ పాల్గొన్నారు.

మట్కాబీటర్ల అరెస్ట్

యల్లనూరు: మండలంలో శుక్రవారం ముగ్గురు మట్కాబీటర్లను అరెస్ట్ చేసినట్లు పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. తిమ్మంపల్లికి చెందిన ఆరవేటి బాలమునేంద్ర, నాగరాజు, మస్తాన్‌ను పట్టుకుని మట్కా చీటీలతోపాటు రూ.15 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు.

యాడికి: యాడికి, వేములపాడుకు చెందిన ఇద్దరు మట్కాబీటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రానికి చెందిన జయమ్మ, వేములపాడుకు చెందిన దశపుత్రుడు మట్కాతోపాటు మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.14,350 నగదు 56 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా సుదర్శన యాగం

తాడిపత్రి అర్బన్: లోక కల్యాణార్థం స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం వికాసతరంగిణి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సుదర్శన యాగం నిర్వహించారు. ఆచార్య పెరంబుదూరుకు చెందిన తిరుమల నల్లాన్ చక్రవర్తుల రామానుజాచార్యుల ఆధ్వర్యంలో ద్రావిడ ప్రబంధ సేవాకాలం, బాలభోగం, విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనం, మంటపారాధన, సుదర్శన శతక అఖండ పారాయణం , అగ్ని ప్రతిష్ట పూర్ణాహుతి చేపట్టారు. రుత్వికులు శ్రీసూక్త సహిత, సుదర్శన యాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరీదేవిని ప్రత్యేకంగా వెండి చీరతో అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం భక్తులను అన్నదానం నిర్వహించారు.

పోలీసు విధులపై అవగాహన

తాడిపత్రి అర్బన్: స్థానిక జయనగర్ కాలనీలోని పద్మవాణి పాఠశాలలో శుక్రవారం పోలీసు విధులపై అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమై ఉంటారన్నారు. నేరాలను అరికట్టడంలో పోలీసు పాత్ర చాలా కీలకమన్నారు. పోలీసు శాఖలో డీజీపీ మొదలుకొని కానిస్టేబుల్ వరకు ఉన్న హోదాల గురించి విద్యార్థులకు వివరించారు. మహిళలు ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని వాట్సాప్ ద్వారా వచ్చే లింకులను క్లిక్ చేయొద్దన్నారు. హెచ్ఎం నాగపేరయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

పెద్దవడుగూరు: ఆత్మహత్యకు యత్నించిన బాలిక మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన అన్నలేఖ(16) చింతలపూడిలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతోంది. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన లోకేశ్వరరెడ్డితో ప్రేమలో పడింది. గత నెల 25 న కాలేజీ నుంచి బయటకు వచ్చి లోకేశ్వరరెడ్డితో వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 1న పోలీస్ స్టేషన్ వచ్చేలా మాట్లాడారు. అంతకుమునుపే ప్రేమికులిద్దరూ పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఇద్దరినీ అనంతపురం తరలించారు. పరిస్థితి విషమించడంతో బాలిక మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

నేడు పప్పుశనగ విత్తన పంపిణీ

గుంతకల్లు: రబీ రైతులకు శనివారం ఉదయం కసాపురంలో సబ్సిడీ విత్తన పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయధికారులు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరవుతారన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట

పాతకొత్తచెరువులో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే వైవీఆర్ హాజరుకానున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

యాడికి: హౌసింగ్ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ప్రశాంత్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని చందన రహదారిలో జగనన్న లేఅవుట్‌లో పర్యటించి లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు.

విద్యుత్ మోటార్ల దొంగ అరెస్టు

తాడిపత్రి అర్బన్: విద్యుత్ మోటార్ల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు... ఇటీవల పట్టణంలో విద్యుత్ మోటార్ల చోరీలు అధికమయ్యాయి. పలు ఫిర్యాదులు అందడంతో డీఎస్పీ సీఎం గంగయ్య ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీఐ హమీద్‌ఖాన్ నేతృత్వంలో ఎస్ఐ ధరణీబాబు, సిబ్బంది వెంకటేష్ నాయక్, పవన్‌కుమార్, రాములు రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం చుక్కలూరు క్రాస్ వద్ద బాల గోవిందు అనే యువకుడిని అరెస్టు చేసి 20 మోటార్లు స్వాధీనం చేసుకున్నారు. బాల గోవిందును పట్టణంలోని శ్రీరాములపేటకు చెందినవాడిగా గుర్తించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

ఏపీకి 512 టీఎంసీలు కేటాయించాలి

తాడిపత్రి అర్బన్: ఏపీకి 512 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. కృష్ణా నది జలాల పంపిణీలో విషయంలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం సీపీఐ రైతు సంఘం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ విభజన హామీల్లో బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించగా అందులో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు దక్కాయన్నారు. నాయకులు చిరంజీవియాదవ్, రమణ, రామాంజి, చంద్రశేఖర్, శ్రీరాములు, అబ్రహమ్ తదితరులు పాల్గొన్నారు .

కృష్ణా జలాల పంపిణీలో అన్యాయం సహించం

గుంతకల్లు: కృష్ణా జలాలు పంపిణీలో ఏపీకి అన్యాయం జరిగితే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ హెచ్చరించారు. కృష్ణా జలాల పంపిణీలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ సీపీఐ నాయకులు శనివారం పట్టణంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. జగదీష్ మాట్లాడుతూ విభజన చట్టంలో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారని, బచావత్ ట్రిబ్యునల్ అంగీకరించిందన్నారు. అయితే ఇప్పుడు కొత్తగా బ్రిజేష్ ట్రిబ్యునల్ కమిటీ ఏర్పాటు చేసి ఏపీకి అన్యాయం చేస్తున్నారన్నారు. నాయకులు వీరభద్రస్వామి, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్ ఉన్నారు.